


పెద్దచెరువు కట్టమీని మఱ్ఱిచెట్టు ముసలిదైపోయింది. కొమ్మలు విరిగి మోడుదేలి చెట్టు వికారంగా ఉంది. తొఱ్ఱల ప్రక్కగా ఎండుగొస్తున్నది. చెట్టు ప్రక్క చెరువు మెట్లు పగిలిపోయి గండ్లుపడ్డవి. చెరువునిండా నాచుపట్టింది. తూర్పు ప్రక్కని తూము మీదినుంచు సగం పడిపోయింది. తూము ప్రక్కన నిల్చున్న నరసయ్య డొక్క లాక్కుపోయింది. భుజంమీద కఱ్ఱ పెట్టి కఱ్ఱిమీద వ్రూవల్లాంటి చేతులుంచి చెరువులో గొడ్లు దిగకుండా చూస్తున్నాడు. పెద్దచెరువు పసరు వేస్తేనేం- ఆవూరి కాధారం. ఎక్కడ త్రవ్వినా ఉప్పునీళ్ళు పడే ఆ గ్రామానికి కడో అమృత కలశం.

మోకాలిలోతున దిగి బట్ట ఎగబట్టుకొని ఎడమకాలిమీది కెత్తుకొన్న నీటిబిందె నట్లాగే ఉంచిన వెంకాయమ్మ, నిలబడి నోరు నొక్కుకొంటూ పైమెట్టుమీద సుందరమ్మ చెప్పే కబుర్లు వింటున్నది.

'ఇవేం అపరబుద్ధులమ్మా!' అన్నది దుర్గాంబ చంకనున్న ఖాళీబిందె క్రిందపెడుతూ.

'ఆ ధర్మాత్ముడు పోయినాడు. ఇంక వీళ్ళు ఆడింది ఆట పాడింది 'పాట.' అందుకొన్నది వెంకాయమ్మ.

'ఎంతపెద్దా బ్రాహ్మణులంగదా, నలుగురూ ఏమనుకొంటారో అనన్నా ఉండక్కర్లా?' సాగదీసింది సుందరమ్మ.

'వెఱ్ఱెత్తిపోయినారు. ఎవరేమనుకుంటే వాళ్ళకేం!' తీర్పుచెప్పింది దుర్గాంబ మూతిముడుస్తూ.

'ఆ చిన్నాడు!- వాడో పిడుగు. నిన్న మధ్యాహ్నం సత్రంలో భోజనం చేశాడట!'

'సత్రంలోనా? అదేం ఖర్మమమ్మా! కమ్మని

"సుబ్బన్న"

నేతిబొట్టు, కందిపప్పు- మహారాజులాగ ఇంట్లో తినక, ఆ సత్రపు కూడెందుకూ?'

'మహారాజు గిహారాజు- తండ్రితో నే పోయింది ఆ రాజదశ కాస్తా.'

'అదేగామాలక్కయ్యా! నిన్న మా లక్ష్మి అంటే- ఏమిటో అనుకొన్నా.'

'ఏమన్నది మీ లక్ష్మి?'

'సత్రంలో పేదలకి ఏ రకం తిండి పెడుతున్నారో చూదామని అమాంతం వెళ్ళి ఆ ముష్టివాళ్ళతో పాటు తానూ భోజనానికి కూర్చున్నాడట!'

'ముష్టివాళ్ళ తిండికి రకమేమి టక్కయ్యా! పోనీ అదేదో తెలుసుకోవాలంటే తానూ వాళ్ళతో భోజనానికి కూర్చోవాలా?'

'వాడిరాత. ఎంతుంటేనేం. నొష్ట రాసిన రాత. అది సరేలే. ఈ మాటలు విన్నావా? శారదని తీసుకొచ్చి ఇంట్లోనే—అవ్వ! తల్లి.' సుందరమ్మ నోరు నొక్కుకొన్నది.

'ఇంకేం మంచి నిర్వాహమే!'

'సరేగాని, ఇవన్నీ చూస్తూ శాస్తుర్లుగారు ఎలా ఊరుకొన్నారంట!'

'అప్పుడే ఏమైందక్కయ్యా! రేపు రచ్చకీడ్చి వెలివెయ్యరూ!'

* * *

వెంకటప్పయ్యగారు ఆ ప్రాంతాల్లోకల్లా పెద్ద భూస్వామి. ధాన్యలక్ష్మివారి గాదెల్లో కాపురముండేది. ధనలక్ష్మివారి ముంగిట నాట్యం చేసింది. హోదాకు తగినట్లు మంచి వ్యవహారకర్త. బీద బిక్కా సంగతి ఎలాగున్నా పేరు ప్రఖ్యాతులు వచ్చేపన్లు చేస్తుండేవారు. గ్రామానికో పెద్దచెరువు త్రవ్వించి 'సెబాస్' అనిపించుకొన్నారు. సత్రం కట్టించి దానిపేర కొంత పొలం వ్రాసి 'మహారాజు' లాగ ప్రవర్తించారు. అందమైన మోహనాంగికో అద్దాలమేడ కట్టించి 'దర్జాకు' వన్నెలు దిద్దుకొన్నారు. ధర్మపత్ని వల్ల ముగ్గురు కొమాళ్లను కని పున్నామ నరకాన్ని తప్పించుకొన్నారు. అద్దాల మేడలో పుట్టిన ముద్దుల శారద ఆయన కూతురే.

పెద్దకొడుకు సోమసుందరం ప్రక్కనున్న పట్టణంలో 'ప్రాక్టీసు' పెట్టుకొన్నాడు. రెండవ కొమారుడు కాశీలోను, మూడవకొడుకు మద్రాసులోను చదువుకొంటున్నారు. శారద ఆ గ్రామంలోనే అల్లారు ముద్దుగా పెరుగుతూ, తల్లిదగ్గరే సంగీతం నేర్చుకొంటున్నది.

వెంకటప్పయ్యగారి అకాలమరణం పట్టణాల్లోని కొడుకులను పల్లెకు లాగింది. భారమంతా సోమసుందరంపైన బడ్డది. పదిరోజులు ఎవరికీ తీరికలేదు. బంధువులు, గ్రామ పెద్దలు కడుపునిండా తిని, కంటినిండా నీరుపెట్టి, వెంకటప్పయ్యగారిని పీతైనంత పొగిడి, తండ్రి గౌరవం నిలపమని కొడుకులకుపదేశించి, చేతికి చిక్కినంతవరకు పట్టుకు చక్కా పోయినారు.

అన్నదమ్ములకు కొంచెం తెరిపి చిక్కింది. సోమసుందరం వ్యవహారాలు చూస్తున్నాడు. క్రిష్ణారావు తండ్రి కీర్తి, ఊరి సంగతి విచారిస్తున్నాడు. రామారావు ఊరంతా కలియదిరిగి, తండ్రి త్రవ్వించిన చెరువుచుట్టూ తిరిగి, నడివీధిగుండా అద్దాలమేడ చేరుకొన్నాడు. కంటతడిపెట్టిన నడివయసు మోహనాంగిని పలకరించకుండానే పైకి వెళ్లాడు. విచారంగా కూర్చున్న శారదను రెండు చేతుల్తో పట్టుకుని లేవదీశాడు. శారద దుఃఖంతో తల వంచేసింది. ఆ అందాలభరిణె ముఖాన్ని పైకెత్తి పెద్దపెద్ద కళ్ళల్లోకి చూచాడు. కాటుక రేఖల్లో ఏమో చదివాడు. గిర్రున తిరిగే కన్నీటి సందేశాన్నందుకొన్నాడు. యౌవ్వనపు వంపుల్లో ఆ పడుచు కదిలిరాగా చెయ్యిపట్టుకు క్రిందికి దింపాడు. 'చెల్లిని తీసుకు వెడుతున్నానండీ' అన్నాడు మోహనాంగితో. అదరిపడి తెరిచిన మోహనాంగి నోటి పెదవులు కదలకముందే శారద రామారావుతో వెళ్లిపోయింది.

ఊళ్ళో 'గుప్పు' మన్నది. ఏనోట విన్నా అదే కబురు. ఏవాడ చూచినా అదే రచ్చ. పొడుంపట్టు పీల్చి 'దీని అంతు కనుక్కొంటా' నన్నారు శాస్త్రిగారు. 'లేతలోనే త్రుంచాల' న్నారు అవధానిగారు. 'రేపీపాటికి తేల్చివేస్తా' నన్నారు శాస్తుర్లుగారు.

* * *

సోమసుందరం హాల్లో ఆలోచిస్తూ కూర్చున్నాడు. తెల్లగడ్డలు కట్టుకొని కంట నీరు పెట్టింది తల్లి. కృష్ణారావు ఏవో కాగితాలు తిరుగవేస్తున్నాడు.

'దీనికో పెద్ద ఆలోచనేమిట్రా! మన బ్రతుకు మనం బ్రతకడానికి? ఎవరో ఏదో అనుకొంటారని మన పద్ధతులు మార్చుకోవడమే!' ఉద్రేకంగా మాట్లాడాడు రామారావు.

'తొందరపడక.'

'తొందరేమిటి? మన సొమ్ము తిని మనవల్ల బ్రతికే సోమరిపోతులంతా నోటి కొచ్చినట్లు వాగుతూంటే వింటూ కూర్చోమంటావా?'

'తొందర పడవద్దన్నాను. అంతే.'

కాగితాలు చూసి కృష్ణారావు అన్నాడు: 'చెరువు మరమ్మతులకని సాలుకు రెండు వందలిస్తున్నారు. ఉజ్జాయింపుగా సత్రం క్రింద నెలకు మూడువందలు ఖర్చు పెడుతున్నారు.'

'ఛీఛీ. విన్నావా అన్నయ్యా, ఇంకా ఊరుకోవాలట. చెరువు చూశావు గదా ఎట్లా ఉందో. సత్రం సంగతి చెప్పనే అక్కర్లేదు. రామరామ.'

'కొంచెం నెమ్మదించు నాయనా, మీనాన్నగారి గౌరవానికి' తల్లి కళ్లు తుడుచుకొన్నది.

'ఇంకా నెమ్మదేమిటమ్మా! నాన్న పేరు సోమరిపోతుల పొట్టకు పెంచింది. బీదవాళ్లు బక్కచిక్కారు. నెలకు మూడు వందలు తీసుకొనే శివావధాని నాన్నను పొగిడి ముష్టివాళ్ళ నోట మట్టికొట్టి తానో మేడ గట్టాడు.' చెరువు మెట్లు పగిలిపోయినై, నీరు పసరు పట్టింది. కంట్రాక్టరు సుబ్బయ్య మాత్రం నున్నబడ్డాడు.'

నెమ్మదిగా వ్యవహారాలన్నీ చక్కబరుస్తానని సోమసుందరం హామీ ఇచ్చిన తర్వాత రామారావు ధోరణి ఆపుకొన్నాడు.

సోమసుందరం శివావధాన్ని పిలిపించి విచారిస్తున్నాడు. నెలకు మూడువందలు ఏవిధంగా ఖర్చవుతున్న విషయంమీద లాయరు గారి ప్రశ్నలు శివావధాన్ని కొంచెం తికమకలు పెట్టినై. ఇంట బట్టిన పందికొక్కులకు ప్రక్కదారులు బాగా తెలుసు. శివావదాని వెంకటప్పయ్యగారి ఘనత ఏకరువు పెడుతున్నాడు: 'మహారాజా చెరువులు త్రవ్వించి సత్రాలు కట్టించారు...'

పూర్తిగాకముందే రామారావు అడ్డు ప్రశ్న వేశాడు, 'దేనికి?'

'సత్రాలు కట్టించడం దేనికేమిటి?'- శివావధాని ఆలోచించాడు 'అది వారి ధర్మబుద్ధి- అది సహజంగా పుట్టుకరావాలి. మహారాజులాగ ప్రవర్తించారు. ఎవ్వరికైనా ఏమైనా అడిగేవారా? ఇబ్బందిపొందేవారా?'

రామారావుకు చెరువు కాపరి నరసయ్య బక్కచిక్కిన రూపం కనిపించింది. ఆ మాటలు వికటంగా తోచినై, ఏదో అనబోతే సోమసుందరం వారించాడు.

శివావధానిగార్ని, వారి ముప్పై సంవత్సరాల అఖండమైన 'సర్వీస్' ఐనా గమనించకుండా అక్కడనుండి తప్పుకోమన్నారు. ముఖస్తుతి, భట్రాజు పొగడ్త తియ్యని అబద్ధాలు మహారాజుల ముందేగాని సామాన్యులైన వారి ముందు అట్టే పని చెయ్యలేదు. 'కబుర్లు చెప్పి సోమరితనంగా బ్రతకడం ఈ పిల్లల హయాంలో చాలా కష్టమని గుర్తించిన శివావధాని కిక్కురుమనకుండా రోడ్డున పడ్డాడు.

పట్టణాల్లో పెరిగారేగాని 'దర్జా' అంటే ఏమిటో తెలియదనీ, తండ్రికి తగిన కొడుకులు కారని, కాలమహిమ అనీ, విపరీతపు బుద్ధులనీ- తలకోరకంగా చెప్పుకొంటున్నారు. కృష్ణారావు దగ్గరుండి చెరువు మరమ్మతు చేయిస్తున్నాడు. 'మీరు ,కాశీ వెళ్లవలసిన అవసరం లేదా?' ఊసూరుమంటూ అడిగాడు కంట్రాక్టరు సుబ్బయ్య.

'మీ కంట్రాక్టులతో పని లేద' న్నాడు కృష్ణారావు.

'ఆ మహారాజుకే చెల్లిందా దర్జా' అనుకుంటూ పోయినాడు సుబ్బయ్య.'

* * *

పెద్దలంతా కట్టమీద సభచేశారు. చర్చ జోరుగా జరుగుతున్నది. తలొకమాట విసురుతున్నారు. 'బ్రాహ్మడి నోటిదగ్గర కూడు తీశారు.'

'ముప్పై సంవత్సరాలుగా ఆ మహారాజు చేత నియామకం చేయబడ్డ శివావధాన్ని వెళ్లగొట్టే హక్కు వీళ్ళకేముంది?' కరణంగారు గర్జించారు.

'సిగ్గులేకుండా కూలివాళ్ళతో నిలబడి పని చేయిస్తున్నారు.'

'తరతరాలుగా వచ్చే కంట్రాక్టుపద్ధతి రద్దు చేశారు. దాన్ని దోపిడివిధాన మంటున్నారు.'

'సాని కూతుర్ని ఇంట్లో పెట్టుకొని చెల్లిలంటున్నారు.'

'ముష్టివాళ్ళతో కూర్చుని భోంచేశాడు.'

'కష్టపడి తండ్రి ఆర్జించిన కీర్తికి చీడపురుగులైనారు.'

కరణంగారు అనుభవజ్ఞులు గనుక కాగితం మీద నాలుగుపంక్తులు గబగబ బరికేశారు.

'గౌరవనీయులు, ఉదారస్వభావులు, మృతజీవులైన వెంకటప్పయ్యగారి కుటుంబాన్ని, వారి కొమారుల అక్రమ అవినీతి చర్యల ఫలితంగా వెలివేయడానికి, పెద్దలు చాలా చింతించుచున్నారు.'

గ్రామ పెద్దలంతా తీర్మానంపై సంతకంచేసి శివావధాని ద్వారా సోమసుందరానికి పంపించారు.

'తగినశాస్తి జరిగింది వెధవలకు' అనుకొంటూ శివావధాని ఆకాగితాన్ని సోమసుందరానికందజేశాడు.

'ఏమిటిది?'


'శ్రీముఖం. మిమ్మల్ని వెలివేశారు'

'గెట్ అవుట్ ఇడియట్' అంటూ సోమసుందరం ఆ కాగితాన్ని చించి పారేశాడు. హతాశుడై శివావధాని తిరుగుముఖం పెట్టాడు.

సోమరిపోతుల ఆటలు సాగలేదు. సోమసుందరం చట్టరీత్యా పని జేస్తున్నాడు. అక్రమంగా ఆక్రమించుకోబడిన తమ స్థలాలన్నింటిని వశపరుచుకొన్నాడు. దేవతార్చన చేసే రామశాస్త్రిగారు ఇల్లు ఖాళీ చేయవలసివచ్చింది. వారికి తామరవ్యాధి వున్నందున రామారావు వారి గడప త్రొక్కవద్దన్నాడు.

'వెలివేయబడ్డ వారింటికి వెళ్ళేదెవరు?' చెప్పి పోషించాడుగాని రామశాస్త్రికి తలదాచుకోవడానికి చోటు దొరకడం దుర్లభంగానే కనిపించింది. మహారాజు పోయినాడు, ఈ కొడుకుల హయాంలో తనలాంటి సోమరికి అనారోగ్యవంతునకు సులువుగా భుక్తి గడవటం అసంభవమనిపించింది.

ఖాళీ చేయబడిన జాగాలో బారులు తీర్చిన పాకలు వేయబడ్డవి. కష్టించి పనిచేసే కమతగాళ్ళకు ఆ పాకలు ఉచితంగా లభించినై. చీన



బక్క కేదో ఇంత దొరుకుతున్నది. చెరువు కాపరి నరసయ్యకు వంటినిండా బట్టా కడుపునిండా కూడు తలదాచుకోడానికి కొంప అమరినై. కంట్రాక్టరు సుబ్బయ్యకు తన గడ్డివామిని ఈ వనహోటళ్లగా వేసుకొంటున్న స్థలంనుంచి మార్పించవలసి వచ్చింది.

* * *

చెరువుకుండు సిమెంటుతో గుండ్రంగా అందంగా సొగసుగా తయారైంది. మెట్లు వరుసలుతీర్చి కట్టబడ్డవి. చెరువులో నాచు పసరు పోయినై. కలువపూలు విరియబూసి కన్నుల పండువుగా ఉన్నాయి. నీళ్లు కలకతేరి శుభ్రంగా ఉన్నై. చెరువులో ఆకులుగాల్చి నీటిని మలినపర్చి, పశువుల కాశ్రయమిచ్చి చెరువుకట్టనంతా అశుభ్రపరచి, తన తొఱ్ఱల్లో విషపు పాముల నిముడ్చుకొని, పెద్ద మఱ్ఱిగా పేరుపొందిన మోడు పూర్తిగా తొలిగింపబడ్డవి. మెట్ల కిరువైపుల కట్టమీద మెట్టతామరచెట్లు పూతపూసి తలలూపినాయి.

చెరువు మెట్లమీద గుడ్డలుతికే సుందరమ్మగారిని దూరంగా చూస్తున్నాడు నరసయ్య.

'ఓరి గాడిదా ఈ నౌకరెక్కడిదిరా నీకు? అల్పబుద్ధివారి కధికారమిచ్చిన దొడ్డవారినెల్ల దొలగగొట్టునట. భేష్ అనుకుంటూ వెళ్ళింది.

'దొడ్డవారెవరో దొంగలెవరో' నరసయ్యకు అర్థంకాలేదు.

అక్బరు కొలువులో వికటకవి

# వీరబల వినోదాలు

జి. వి ఆర్. కృష్ణారావు

ఓసారి వాహ్యాళికిపోతూ కూడా ఉండి ఉల్లాసంగా కబుర్లు చెపుతూ ఉన్న వీరబల్‌ని అక్బరు పాదుషా,

'వీరబల్! నిజానికీ అబద్ధానికీ ఎంత తేడా?' అని అడిగాడు.

వీరబల్ వెంటనే, 'ప్రభూ! నిజానికీ అబద్ధానికీ గల తేడా సరిగ్గా మన కళ్ళకీ చెవులకీ మధ్య ఉన్నంతే' అని సమాధానం చెప్పాడు.

'అంటే? విన్నగా చెప్పు. అర్థమయ్యేలాగ' అని పాదుషా మళ్ళీ అడగడంతోనే,

'కంటితో చూచింది నిజమూ, చెవులతో విన్నది అబద్ధమూ ప్రభూ! అంతలోనే ఉంది నిజానికీ అసత్యానికీ వ్యత్యాసం' అని వీరబల్ విస్పష్టం చేశాడు.

* * *

అక్బరు పాదుషా, వినికిడివల్ల తూర్పుదేశపు ప్రజలుమందబుద్ధులూ మొరటువాళ్లూ అని తెలిసికొని అందులోని నిజానిజాలు కనుక్కొని తెలియచేయమని వీరబల్ుణ్ణి కోరాడు. దేశం నాలుగువైపులా స్వయంగా సంచారం చేసి పరిమిత కాలంలో వీరబలుడు మంచి ప్రఖ్యాతి చెందిన నలుగురు వారాంగనలని తనతోబాటు తీసికొనివచ్చాడు. వారిని చూపించి, వీరబల్ అక్బరు ఎదుట ఆ రాత్రి నృత్యప్రదర్శనం ఏర్పాటు చేయించాడు. వారిలో ఒక్కొక్కరికీ ప్రత్యేకంగా అంతఃపురంలో మంచి గదులు ఏర్పాటుచేయించి, నాట్యంచేశాక వెళ్ళి అందులోనే విశ్రాంతి తీసికొమ్మని వారికి చెప్పాడు. నృత్యం చాలా బాగుంది. అక్బరు చాలా మెచ్చుకున్నాడు. ప్రదర్శనం అయ్యాక వీరబల్ అక్బరుకి మునుపటి విషయం జ్ఞాపకం చేసి దేశంలో నాలుగుప్రాంతాలలో ఉండే జనుల లక్షణాలు తెలిసికోవాలంటే తెల్లవారుగట్ల తనతోబాటు అంతఃపుర సంచారం చెయ్యాలని తెలియజేశాడు. అక్బరుకి ఇదంతా అయోమయంగా కనిపించింది. 'సరే' అని ఆనాటికి అక్బరు వెళ్ళి హాయిగా నిద్రపోయాడు. మరు